క్లుప్తంగా

23న యల్లమ్మ మహోత్సవం

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ పాతపేటలోని ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 23 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఉదయం 10 గంటలకు అభిషేకం, మొలకల నోములు, రాత్రి 8.30 గంటలకు బాణసంచా వేడుకలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 24న మధ్యాహ్నం అన్నదానం, అర్జున్ తపస్మాన్, రాత్రి నాటక ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షమ్మ



కల్లూరులో ప్రత్యేక అలంకరణలో విరూపాక్షమ్మ

పులిచెర్ల(కల్లూరు): గంగజాతరలో భాగంగా కల్లూరులో రెండవరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, నవధాన్య మొలక పూజ, 108 కలశాభిషేకం(పసుపునీటితో), గణపతి హోమం, దుర్గా హోమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసారు. అనంతరం అన్నదానం చేశారు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

పలమనేరు: గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలని స్థానిక ఇండేన్ గ్యాస్ నిర్వాహకులు సుబ్రమణ్యం నాయుడు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. తమ కార్యాలయం వద్దగానీ లేదా గాస్ డెలివరీ బాయ్స్ ఇంటికి వచ్చినప్పుడు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నుంచి గ్యాస్ రాయితీ పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని తెలియజేశారు.

శేష వాహనంపై విహారం



శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

సదుం: మండలంలోని బూరగమందలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అభిషేకాలు, విశేషాలంకారం, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను శేషవాహనంపై మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

కళా తరంగిణి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో శిల్పారామం పాలనాధికారి సుధాకర్

బైరెడ్డిపల్లె: రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పులివెందుల శిల్పారామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో బైరెడ్డిపల్లె కళా తరంగిణి సంస్థ విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. శాస్త్రీయ, జానపద, సినీ నృత్యాలతో అలరించిన విద్యార్థులు లహరి, గగన, భరత్, శృతి, పళని, మధుశ్రీ, పావని, చరిత, జీవన్, రేయాన్, వరప్రసాద్, మనోజ్, మురళి, దినేష్‌లను శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్‌బాబు, సీనియర్ కొరియోగ్రాఫర్ కళాకిరణ్, పర్యవేక్షకులు గోపి, నాగరాజు, సోము పాల్గొన్నారు.

లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలి

బంగారుపాళెం: మామిడి వ్యాపారులు లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని ఏఎంసీ కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన మార్కెట్ యార్డ్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యాపారులు నిబంధనలు పాటించి వ్యాపారాలు సాగించాలన్నారు. వ్యాపారులు మార్కెట్ యార్డ్‌లో షెడ్ల నిర్వాహణకు సంబంధించి అద్దె బకాయిలను చెల్లించాలన్నారు. ఈ నెల 24వ తేదీలోపు అద్దెబకాయిలను చెల్లించి, లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గరుడాద్రి కొలువులో జగన్మోహనాకారుడు

- మోహినీ అవతారంలో శ్రీనివాసుని స్వరూపం
- కనుల పండువగా స్వామివారి కల్యాణోత్సవం



జగన్మోహిని అవతారంలో కోనేటిరాయుడు



గరుడ వాహనంపై విహరిస్తున్న కోనేటిరాయుడు

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో 5వ రోజు సోమవారం ఉదయం అభయ ప్రధాత స్వరూపుడైన శ్రీనివాసుడు జగన్మోహినీ అవతారంలో తిరుచ్చిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారి తిరుచ్చి ముందు భక్త బృందాలు, డప్పు వాయిద్యాలు, సంగీతాలాపనతో స్వామివారిని కీర్తిస్తూ మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి ఉత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. తొలుత స్వామివారి సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, అభిషేకం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గరుడుని భుజ స్కంధాలపై కోనేటిరాయుడి దర్శనం

ఉత్సవాల్లో ఇదే రోజు రాత్రి సర్వాలంకార భూషితుడైన శ్రీ కోనేటిరాయుడు గరుత్మంతుని భుజస్కంధాలపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. సమస్త వాహనాల్లో సర్వశ్రేష్ఠమైన గరుడ వాహనంపై ఊరేగే స్వామివారిని దర్శిస్తే సమస్త భోగభాగ్యాలు, శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో శ్రీవారి గరుడసేవకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి పారవశ్యంలో మునిగితేలారు.

కమనీయం.. కల్యాణోత్సవం

కీలపట్ల శ్రీ కోనేటిరాయుని కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఆస్థాన మండపంలో ప్రత్యేక కళ్యాణవేదికపై కొలువుదీర్చి, వేద పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవింద నామస్మరణ, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. కల్యాణోత్సవంలో భజన బృందాలతోపాటు హిందూ ధర్మ పరిషత్ కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

మంగళవారం ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం వసంతోత్సవం, గ్రామోత్సవం, రాత్రి గజవాహనంపై శ్రీవారు విహరిస్తారని టీటీడీ ఏఈఓ గోపీనాథ్ తెలిపారు. కంకణంబట్టార్ ఏకే.నరసింహాచార్యులు, డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.





భక్తజన సందడి నడుమ కోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగమ్మా! చల్లంగ దీవించమ్మా..





ప్రత్యేక అలంకరణలో మారెమ్మ, గంగమ్మ

- అన్నదానం చేసిన కులసంఘాలు
- మారెమ్మ ఆలయం వద్ద పొంగళ్లు
- మంగళవారం ఉదయం వరకూ శిరస్సు మెరవణి
- నేడు అమ్మవారి విశ్వరూప దర్శనం

పలమనేరు: పట్టణంలోని శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు ముందు రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించి పసుపు, కుంకుమతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే మారెమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సోమవారం అర్ధరాత్రి అమ్మవారి శిరస్సు మెరవణి కోలాహలంగా మొదలైంది. మంగళవారం ఉదయం ఈ మెరవణి ముగుస్తుంది. ఇందుకోసం దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. సీఐ చంద్రశేఖర్ బందోబస్తు కల్పించారు.

మారెమ్మకు నాగజ్వాల కిరీటం సమర్పణ

పట్టణంలోని రంగాపురానికి చెందిన అమ్మవారి భక్తులు బసవేశ్వరి వెండితో చేసిన రూ.2లక్షలు విలువజేసే నాగజ్వాల కిరీటాన్ని అమ్మవారికి సమర్పించారు. ఈ కిరీటానికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఇదలా ఉంచితే, ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో భక్తులు పులకించారు.



నాగజ్వాల కిరీటాన్ని సమర్పిస్తున్న బసవేశ్వరి

టి. వడ్దూరులో ముగిసిన గంగజాతర

మండలంలోని టి. వడ్దూరులో నడివీధి గంగమ్మ జాతర సోమవారం జలధితో ముగిసింది. పలమనేరులో జరిగే గంగజాతరకు ముందు ఇక్కడ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. గ్రామంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

పలమనేరు నియోజకవర్గంలోని ప్రజలు గంగమ్మ అనుగ్రహంతో సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ ఓ ప్రకటనలో తెలిపారు. జాతరలు మన సంస్కృతికి చిహ్నాలని, గంగమ్మ కరుణతో ఈ పర్యాయం వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు సమృద్ధి పండాలని ఆకాంక్షించారు.

జాతరలో భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి

- డీఎస్పీ శ్రీనాథ్



జాతర బందోబస్తుకు వచ్చిన పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనాథ్

కుప్పం: మూడు రోజులు పాటు నిర్వహించే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని డీఎస్పీ శ్రీనాథ్ ఆదేశించారు. జాతర బందోబస్తుకు వచ్చిన 250మంది పోలీసులకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం ప్రారంభమయ్యే శిరస్సు ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విధులు నిర్వర్తించాలన్నారు. జంతు బలులు ఇచ్చే వారిపై నిఘా పెట్టాలని, గొడవలు, ఘర్షణలకు దిగితే అటువంటి వారిని గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనానికి భారీ ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో దేవదాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన క్యూలలో భక్తులు వెళ్లేలా చూడాలన్నారు. భక్తులతో స్నేహపూరితంగా మసలుకోవాలని, జాతర ముగిసే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

మొగిలిలో ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించినట్లు ఈఓ మునిరాజులు తెలిపారు. ఈ సందర్భంగా స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దోష నివారణ పూజలు చేయించుకున్నారు.

జాతరకు నిరంతర విద్యుత్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న గంగమ్మ జాతరకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయనున్నట్టు ట్రాన్స్‌కో డీఈ శేషాద్రి తెలిపారు. సాధారణంగానే నగరంలో కోతలు లేవన్నారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన చోట క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

ప్రశాంత వాతావరణంలో జాతర ముఖ్యం



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న గంగజాతరలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. గంగజాతర నేపథ్యంలో బందోబస్తు కేటాయించిన అధికారులు, సిబ్బందితో సోమవారం చిత్తూరులోని ఏఆర్ మైదానంలో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరిగే గంగజాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందన్నారు. జనం ఎక్కువగా ఉన్న చోట జేబు దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌కు అవకాశం లేకుండా నిఘా ఉంచాలన్నారు. శాంతి భద్రతలకు ఎక్కడా సమస్య తలెత్తకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు ఇక్కడి పరిస్థితి వివరించాలన్నారు. ఇక ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడ మళ్లించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో జాతర జరిగేలా పోలీసుశాఖ సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సబ్సిడీ వేరుశనగ తీసుకుంటేనే పథకాల లబ్ధి

- వ్యవసాయ శాఖ ఏడీఏ శివకుమార్



రొంపిచెర్ల: బండకిందపల్లె ఆర్‌బీకేలో రైతుల నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వేరుశనగ కాయలు తీసుకున్న వారికే మాత్రమే ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, సబ్సిడీ ఎరువులు, ఇతర పథకాలు వర్తిస్తాయని ఏడీఏ శివకుమార్ తెలిపారు. సోమవారం ఆయన బండకిందపల్లె, రొంపిచెర్ల-2 రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ కాయల కోసం రైతుల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రొంపిచెర్ల మండలానికి 1100 క్వింటాళ్ల కె-6 రకం సబ్సిడీ వేరుశనగ కాయలు వచ్చినట్లు తెలిపారు. ఒక రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు ఇస్తామని, ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఇస్తామన్నారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో 30 కిలోల బస్తా రూ.1710లకు ఇస్తుందన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబరుతో ఆర్‌బీకేలలో ఈ నెల 22 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు, ఆర్‌బీకే సిబ్బంది నరసింహులు, వెంకటరమణ నాయక్, నర్మద, సుజాత, శ్రావణి ,సుబ్రమణ్యం, రేఖ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేరుశనగ విత్తనాల నమోదు

గంగవరం: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీకి సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయనున్నట్టు వ్యవసాయాధికారి హేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తనాలను రైతులకు అందజేస్తామని, రైతులు ముందుగానే పేర్లు నమోదు చేసుకుని డబ్బు చెల్లించాలని, ఇందుకోసం రైతులు తమ ఆధార్, భూమి పాసుపుస్తకం, 1బి జెరాక్స్, ఫోన్(ఓటిపి) కోసం తప్పనిసరిగా వెంట తీసుకెళ్లి సంబంధిత రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. సబ్సిడీ పోను ఒక బస్తా ధర రూ. 1,710 చెల్లించాలన్నారు.

మామడుగు, గండ్రాజుపల్లె-1, గంగవరం-2 ఆర్‌బీకేల్లో సోమవారం నుంచి నమోదు ప్రారంభించినట్లు చెప్పారు.

వి.కోట మండలంలో..

వి.కోట: రైతులకు రాయితీపై వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మి సోమవారం తెలిపారు. ఇప్పటికే మండలానికి 1878.90 క్వింటాళ్లు కే-6 రకం, 101.1 క్వింటాళ్ల టీసీజీఎస్-1694 రకం విత్తనాలు వచ్చినట్టు చెప్పారు. ఈ నెల 23 తేదీన రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్‌తో వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కృష్ణాపురం, ఓగు, వి.కోట, జవునపల్లె రైతు భరోసా కేంద్రాల్లో 27వ తేదీ నుంచి, మిగిలిన పంచాయతీల్లో 23 నుంచే పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.

23 నుంచి కుప్పం, శాంతిపురం మండలాల్లో..

కుప్పం/కుప్పం రూరల్/ శాంతిపురం: రాయితీపై వేరుశనగ విత్తనాలను ఈ నెల 23వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయాధికారులు అమృతవల్లి, అప్సోజి తెలిపారు. 30 కిలోల వేరుశనగ విత్తన కాయల సబ్సిడీపై రూ.1710 ఇవ్వనున్న చెప్పారు. శాంతిపురం, కుప్పం మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. పట్టాదారు పాసు బుక్, ఆధార్ కార్డు, మొబైల్‌తో వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తనాలు పొందవచ్చన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ

పలమనేరు: నియోజకవర్గంలో వినికిడి సమస్య ఉన్న పిల్లలకు బెంగళూరుకు చెందిన జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు స్థానిక కళామందిరంలో సోమవారం 18మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. మళ్లీ ఇలాంటి కార్యక్రమాన్ని పలమనేరులో నిర్వహిస్తామని నిర్వాహకులు ధనుంజయ్, విజయ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప, భవిత సిబ్బంది పాల్గొన్నారు.



వినికిడి యంత్రాలు పొందిన వారితో నిర్వాహకులు

రథోత్సవం

చౌడేపల్లి: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదిదేవుడుగా పేరొందిన పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పుష్పాలంకరణకు ఉభయదారులుగా మల్లిశెట్టి శివశంకర్, శ్రీదేవి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. మేళ తాళాలు, కళాకారుల కోలాటాల నడుమ స్వామివారు రథంపై ఆశీనులపై పురవీధుల్లో విహరించారు. దీనికి బలిజ సంఘం ఉభయదారులుగా వ్యవహరించింది. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రెడ్డిప్రకాష్, వరుణ్ భరత్, జీవన్ ప్రకాష్, కడియాల మురళి, మహేష్‌బాబు, నాగబాల గణేష్, బి. మురళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



చౌడేపల్లెలో నిర్వహిస్తున్న రథోత్సవం

సమస్యలపై తక్షణం స్పందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్యం, నీటి సమస్యలపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అజెండాలోని వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సమస్యలను కూడా గుర్తించి తక్షణం పరిష్కరించాలన్నారు. అకాల వర్షాల మూలాన గ్రామీణ ప్రాంతాలలో జ్వరాల బారిన పడకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు సరోజమ్మ, ఈశ్వరమ్మ, అతిథులుగా పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డితోపాటు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..!

- కమనీయం.. ద్రౌపదీ ధర్మరాజుల కల్యాణోత్సవం
- మొక్కులు చెల్లించేందుకు పోటెత్తిన జనం

గుడుపల్లె: మండలంలో యామగానిపల్లెలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహా భారత మహోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శ్రీ ద్రౌపదీ ధర్మరాజుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ఆలయం వద్ద పచ్చని తోరణాలతో పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు విగ్రహాలతోపాటు ద్రౌపదమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్త జన సందోహం, మంగళ వాయిద్యాల హోరు నడుమ వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం యామగానిపల్లెలో వివాహం కాని యువతి చేత కల్యాణోత్సవాన్ని వేద పండితులు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించి, పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ద్రౌపదీ అమ్మవారి విగ్రహాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు